అతన్ని గూర్చి

వెంపటి నాగభూషణం గారు

౧

ద్వారకనాథశాస్త్రి, నేను చిన్నప్పటి నుంచి ఒకేస్కూల్లో బి. యే. వరకు చదివి కడతేరాము. ఆరోజుల్లో ఆతనంటి వాడు లేడనిపించు కున్నాడు శాస్త్రి. మేమంతా అతన్ని ముద్దుగా 'ద్వారక' అని పిలుస్తూ ఉండేవాళ్లం. మంచి లక్షణాలన్నీ అతనియందుండేవి. ఇతరులకి ఏవిషయంలోనైనా తాను సహాయభూతుడుగా వుంటే అతను మిక్కుటంగా ఆనందించేవాడు. తన కున్నదాంట్లో తృణమో పణమో బీదవిద్యార్థులకు యిస్తుండేవాడు. ఇటువంటి సుగుణాలు గాక అతనిలో మరొక విశేషం ఉండేది. బాల్యంనుండీ గూడా ద్వారక అందమైన వస్తువులను చూచినా, సొగసైన దృశ్యాలను చూచినా, శ్రావ్యమైన గానం విన్నా, మృదువైన కవిత్వం చదివినా, అపరిమితానంద భరితుడై ఉప్పొంగేవాడు. వేషంలో మహాశ్రద్ధవహించి, ఉన్నంతలోనే, అతిరమణీయంగా తయారయ్యేవాడు. తనగది అంతా సొంపైన చిత్రాలతో అలంకరించేవాడు. తానట్లా ఉండడమే కాకుండా, యితరులకుగూడా ఆవిధంగా ప్రవర్తింప వలసిందని సమయానుకూలంగా చెప్తూండే వాడు. కొందరు అపార్థం చేసికొని అతనిమాటల్ని ఆలకింపక పోయినా, కొందరియందైనా అతను ఉత్తేజం కల్గించ లేకపోలేదు. నేనున్నూ, యింకా యిద్దరు ముగ్గురు స్నేహితులూ ద్వారకయందున్న శక్తిసామర్థ్యాలకు అచ్చెరువొందుతూ, తరచుగా అతన్ని కలుసుకోవడం, అతని యింటికి పోయి మాట్లాడడం చేస్తూండే వాళ్లం. ద్వారకతో ఎప్పుడు సంభాషించినా ఏదో క్రొత్తవిషయం నేర్చుకోకుండా ఉండే వాళ్లం కాదు. ఏ రసవంతమైన పద్యమో చదివి ఆనంద పరవశుల్నిగా చేసేవాడు. మరొకప్పుడు ఏచిత్తరువును గురించో ముచ్చటిస్తూ కళారహస్యాన్ని తెలియజేసేవాడు ఈ విధంగా ఆర్టిస్టిక్ జీవితం గడపుతూండే వాడు. జీవిత కాలమంతా సౌఖ్యంగాను, ఆనందంగాను యెందుకు సాగించకూడదని అతని పట్టుదల. జీవితమంటే ఒక సుస్వప్నమన్నమాట అని అంటూండే వాడు. ఆవిధంగానే ద్వారక తన జీవితమంతా సామాన్యవ్యావహారిక ప్రపంచంతో సంబంధం లేకుండా స్వప్నతుల్యంగా జరుపవలెనని, ఆర్టిస్టిక్ జీవితమే మోక్షప్రదాయకమని అతని ఆశయము. దానికోసం ఆ చదువుకునే రోజుల్లోనే బహు ఆవేదన పడేవాడు. వీలైనంతవరకు తన ఆశయాలను అనుచరించే వాడు. కాని కొన్ని సందర్భాలవల్ల, అందులోనూ ముఖ్యంగా ప్రపంచక వ్యవహారాలలో మునిగివుండే తండ్రివల్లనూ, అతను కొన్ని సమయాలలో హతాశు డయే వాడు.

కాని ధైర్యమునుమాత్రం మొక్కవోనిచ్చే వాడు కాడు.

ద్వారకను చూచి అప్పు డప్పుడు మేము అనుకొనేవాళ్లం, జీవితంలో మెలా నెగ్గు కొస్తాడా అని. ఇంత ఆదర్శక ప్రాయంగా జీవించడం సాధ్యమేనా? ఎన్నెన్ని కష్టాలు కలుగుతై? ఎన్నెన్ని విపత్తులు వాటిల్లుతై? జీవిత సంగ్రామ మన్నారు మనవాళ్లు— అని కొంచెం భయపడుతూ ఉండేవాళ్లం. ఇవతల యిట్లా అనుకున్నా ద్వారకదగ్గరకు పోయేసరికి యివన్నీ మాయమయేవి. అతనితో ముచ్చటించినంత సేపు భావసౌధాల నెక్కించి, ఊహా ప్రపంచకంలో విహారం చేయించి, రసజగత్తులో నోలలాడించి, స్వప్నసౌఖ్యం పొందజేసేవాడు. ఒకొక్కప్పుడు ఉక్కిరి బిక్కిరి అయేవాళ్లం.

ఈ విధంగా ఉంటుండగా యిద్దరం బి.ఏ. ప్యాసయినాం. సామాన్యస్థితిపరుణ్ణి గనుక నేను వెంటనే ఉద్యోగంలో ప్రవేశించక తప్పిందిగాదు. ద్వారకకు ఉద్యోగం చేయవలెననే యిచ్ఛా లేదు, అగత్యమూ లేదు. కావలసినంత ఆస్థిగలవాడు. ఒక్కడే కొడుకు. కాని అతని తండ్రిమాత్రం అతన్ని పట్నం పంపి బి. యల్. చెప్పించవలెనని పట్టుపట్టాడు. ఆ చదువు, వృత్తి యేమాత్రం యిష్టం లేదు ద్వారకకు. దానికి బదులుగా ఏ శాంతినికేతన మంటి చోటికో పోయి జీవితం గడపవలెనని తలంపు. అట్లాగని తండ్రికి తెలియజేశాడు కాని, అయనకు యివి యిష్టమవుతాయా? ద్వారక ఎంత చెప్పినా తండ్రి విన్నాడు కాదు. లాకాలేజీకి వెళ్లక తప్పింది కాదు.

౨

అయిదేళ్లు జరిగిపోయినై. ద్వారక తండ్రి ఆస్తినంతా వర్తకంలో కోల్పోయినాడు. ఆ బెంగచేతనే త్వరగా పరమపదించాడు. ద్వారక ఒక్కడు. పిత్రార్జిత మేమీ లేకపోగా ఆయన చేసిన అప్పులుమాత్రం కొన్ని సంక్రమించినై. యాడ్వకేటు పట్టా ఒక్కటే శరణ్యం. కాని ఆ మహాపట్నంలో యిత నెంత? అందులోనూ క్రొత్త. ఇట్టి యిక్కట్లు అతనెప్పుడూ అనుభవించ లేదు; అనుభవించ దల్చుకోనూ లేదు. కాని యిట్టివిషమపరిస్థితులలో జీవితసంతరణ మేలా, తన ఆదర్శములను అనుచరించే దెలా?......ఎంతైనా ద్వారక అతని విచారాన్ని కనపర్చేవాడు కాడు.

ఒకపర్యాయం పనిమీద క్రిస్టమస్ సెలవుల్లో పట్నం వెళ్లాను. అక్కడుండగా ద్వారకమాట స్మరణకు వచ్చింది. వెంటనే అతని నెలవు కనుక్కొలి బయల్దేరాను. ట్రిప్లికేనులో, యెక్కడో చివరగా, ఒక మిద్దెలో అద్దెకున్నాడు. ఇల్లు చిన్నదే అనుకోండి, కాని అతనొక్కడికీ చాలు. అందంగా గూడా వుంది. ముందు చిన్నతోట ఉంది. మేడమీదికి సముద్రంగాలి రివ్వున వీస్తుంది. లోపలంతా ఎంతో రమణీయంగా అలంకరించాడు ద్వారక. బల్లల మీద ఫ్లవరువాజులు, పుదుచ్చేరీ కుక్కలు, కొండపల్లి గోవులు, చలువరాతి చిలుకలు,

నెమళ్లూ ఉన్నాయి. గోడలనిండా ఆర్టుచిత్రాలు వ్రేలాడవేశాడు. అడుగు పెట్టడంతోనే నాకు పూర్వకథ జ్ఞప్తివచ్చింది. మా చిన్ననాటి దృశ్యమంతా ఒక్కమారు స్మృతిపథంలో తళుక్కుమన్నది. మొత్తానికి ద్వారక తన ఆదర్శ జీవిత నియమాలను వ్యావహారిక జీవితంతో సమన్వయం చేసికొన గలిగినాడే అని సంతోషమైంది.

ఆరోజు రాత్రి చాలా సేపు నేనూ, ద్వారక మిద్దెమీద అనేకవిషయాలను గురించి ముచ్చటించాము. అప్పుడే జరుగుతున్న పార్కుఫెయిర్ నిగురించి, అక్కడకు వచ్చిన రకరకాల మనుష్యుల్ని గురించి, వింతవిషయాలనుగురించి, తరువాత మాస్కూలు విషయాల్ని గురించి, నాఉద్యోగపు చిక్కుల్ని గురించి,—యీవిధంగా నేనేఎక్కువ కాలంలో కాభి రామాయణకాలక్షేపణచేశాను. ఇంత సేపు నేను నాఘోషతో అతన్ని హింసించినా ద్వారక ఏవిధమైన అసహనము వెలిబుచ్చలేదు. మధ్య మధ్య ఊఁ కొడుతూ, అట్లాగా, ఓహో, ఎంతపని, నిజంగా, పాపం, మొదలైనపదము లుచ్చరిస్తూ నేను చెప్పినదంతా విన్నాడు. మధ్యలో ఎప్పుడో ఒక్కమారు కాబోలు, అవనీంద్రనాథ టాగూర్ గీసిన 'తిష్యరక్షిత' చిత్తరువునుగూర్చి, రవీంద్రనాథ టాగూర్ రచించిన 'రెడ్ ఓలియాండర్స్' నాటకమును గురించి ప్రస్తావన తెచ్చి చిన్ననాటిధోరణి రుచి చూపించాడు.

మరునాడు ఊరికి ప్రయాణమవుతూ ద్వారకతో అన్నాను: "జీవితం సరళంగానే సాగుతోం దనుకుంటాను. ఏదో కోర్టువ్యవహారం, అదీ—ఊఁ."

"ఏదో జరిగిపోతోంది. ఆగుతుందా" అని వ్యంగ్యంగా జవాబిచ్చాడు.

"అయితే, ద్వారకా, పెళ్లెప్పుడోయ్? ఇంకా యీడు రాలే దనుకున్నావా? మీ ఆవిడ వచ్చింతర్వాత మా బోటివాళ్లు వచ్చి నాలుగురోజు లుండడానికి ఎక్కువ అవకాశ ముంటుంది" అన్నాను.

"అదే, నేను ఆలోచిస్తున్నా. ఇంతకూ కళ్యాణం ఘడియ రావద్దూ? నా పెళ్లి కేం గాని, నీవు వేసంగికి తప్పకుండా రా. ఇక్కడ బీచీ అదీ చల్లగా ఉంటుంది. చూడూ, మరచిపోయినా, యీమాటు మీ గృహిణినిగూడా తీసుకురాసుమా" అని చిరునవ్వుతో నన్ను సాగనంపాడు. ఇంకా పూర్వపుద్వారకే—అనుకుంటూ యింటికి బయల్దేరాను.

3

కాని అతను కోరిన ప్రకారం వేసంగికి పట్నం వెళ్లడం పడలేదు. అనేకపనులు అడ్డం వచ్చినై. ఏ మనుకుంటాడో ద్వారక అని ఆలోచిస్తుండగా నెల్లూరునుంచి మిత్రుడు విజయరెడ్డి ఉత్తరం వ్రాశాడు. బి. యే. చదువుకునే దినాల్లో మే మ్ముగ్గురం ఒకజట్టుగా వుండేవాళ్లం. అంతే కాదు; నామోస్తరే రెడ్డికిగూడా ద్వారక అంటే అనురాగం, ఆదరణ...ఆ ఉత్తరంలో యిలా ఉంది: "నీ పీ మధ్య యెప్పుడైనా ద్వారకను చూచావా? నా కెప్పుడూ

జ్ఞాపకం వస్తూఉంటాడు, అతను. తండ్రిపోరు పడలేక దిక్కుమాలిన ప్లీడరీలో ప్రవేశించాడు. శాంతి నికేతనం, అటువంటిచోట్లకు పోయి కాలం గడపాలని అంటూండేవాడు వెనక, జ్ఞాపకంలేదూ? ఇప్పుడు దమ్మిడీ రావడంలేదట. అసలు ద్వారకకు వకీలువృత్తి అంటే ఎంత అసహ్యమో అప్పుడే చెప్తూండేవాడు. బహుశఆవేదన పడుతూ ఉండాలి ద్వారక; పాపం...... ఇంతకన్న విచారమైన దేమంటే, తండ్రి అప్పులన్నీ యితను తీర్చడానికి పూనుకొన్నాడట. ఛాందసం గాదూ, యిది? తన జీవితమే కష్టసాధ్యంగా ఉంటే, మెడకు యీడోలు గూడా ఎందుకు? ... ... ఇంతకూ యిది ద్వారక స్వయంగా చెప్పింది కాదు సుమా; వినికిడివల్ల తెలియవచ్చింది. నేనూ రెండుమూడు మార్లు ద్వారకను కలుసుకున్నా గాని యీ విషయూ లేమి అంకనీలేదు అతను. చిత్రంగా ఉన్నై వ్యవహారాలు."

ఈజాబు చదివేసరికి నాకు మిక్కుటమైన జాలి కలిగింది. వెంటనే పోయి సంగతి యేమిటో విచారించి ద్వారకకు ఉత్సాహ మిద్దా మనుకున్నా. కాని దౌర్భాగ్యపు మాష్టరీ; శెలవు దొరికింది కాదు......పోనీ, పెద్ద ఆవేశ పూరిత మైన ఉత్తరమైనా వ్రాద్దా మనుకున్నాను. కాని ఒకసందేహం కల్గింది. ఇదంతా నా కెట్లా తెలిసింది అని అనుకొనిపోతాడేమో?—అని. ఇదీ గాకుండా మరొకటి ఆటంకం వచ్చింది. అప్పుడే కొత్తసంసారం, కొత్త వ్యవహారం. చిన్ని అప్పుడే గృహిణిగా అవతరించింది. ఆ దినాల్లో ఒకటి తోచేదా? ఎప్పుడూ చిన్నితోడిదే లోకం. ఆమెకళ్ల నీలిమను, కుట్మలముల నలుపును, చేతి సొంపును, శరీరచ్ఛాయను స్తుతించడమే సరిపోయింది. ఒకరిలో ఒకరు లీనమై ప్రణయపారావారంలో యీదుతున్నాం. అనుభవజ్ఞులకే తెలియాలి అప్పటి సౌఖ్యాన్ని, సందర్భం. ఆ ఆనందజగత్తులోనే ఆమె నాకు ఉత్సాహ మివ్వడం, నే నామెనుగూర్చి కథలు వ్రాయడం, అవి లోకం చదవడం సంభవించింది............ఆపరిస్థితుల్లో ద్వారకమాట పూర్తిగా విస్మరించాను. ఉత్తరంగూడా వ్రాయలేదు. ఇప్పుడు పరితపిస్తాను,ఏమిలాభం?

ఇట్లా ఆరుమాసములు గడచినై. తిరిగి విజయరెడ్డి జాబుమూలమున ద్వారక విషయం కొద్దిగా తెలిసింది. ఈవిధంగా వ్రాశాడు: "చోద్యంగా ఉంటుంది వినడానికి, వ్రాయడానికి. నేను కలలోనైనా ద్వారక యిట్లా అవుతాడని అనుకోలేను. దైవఘటన కాక మరేమిటి, పాపం.తల్చుకుంటే గుండె తరుక్కుపోతుంది... ఇప్పుడు ద్వారక ప్రైవేటుట్యూషన్లు చెప్పి ధనార్జన చేస్తున్నాడట. కొంత భుక్తి గడచేటందుకనుకో; ముఖ్యంగా తండ్రి చేసిన అప్పులు తీర్చడానికట!.........విన్నావా, ఎట్లా పరిణమించినాయో పరిస్థితులు? ఎప్పుడైనా అనుకున్నామా, మన మిట్లా? పాపం. ద్వారక తాను అనుకున్న దానికీ, యిప్పుడు జరిగేదానికీ వ్యత్యాసం ఎట్లా భరిస్తున్నాడోనోయ్! విద్యార్థుల కోసం రోజుకు పదహారు గంటలు పనిచేస్తున్నాట్ట.

అంత పని ఎట్లా భరిస్తున్నాడో. ఎప్పుడైనా అనుభవించడా యిట్లా? నాకే చాలా కష్టంగా వుంది......" నాకు తల దిమ్మెక్కింది. మనస్సు పరిపరివిధాల పోయింది. చెంగున పోయి అతని కష్టాలన్నీ ఒక్కమారు నివర్తిద్దామనుకున్నా. అంతశక్తి లేకపోయినా తుదకు పలుకులతోనైనా అతని బాధ కొంత వారించవచ్చును గదా అనుకున్నా. కాని సంకల్పానికి, అది సిద్ధి పొందడానికి మధ్యకాలంలో సముద్రాలు దొర్లిపోతై అన్నాడొక ఆంగ్లకవి. అట్లాగే జరిగింది......ఏమాత్రం తీరుబడీ అయింది కాదు. ఒక్క దినం శెలవైనా దొరకలేదు .... ఇంతలో అసహాయోద్యమ ఝంఝామారుతం దేశంలో కాశ్మీరంనుంచి కన్యాకుమారివరకూ వీచింది. ఆమహాప్రళయంలో అన్నీ—సంస్థలు, సభ్యతలు, భావసౌధాలు,—అన్నీ తారుమారైనవి. దానికి అనుగుణ్యంగానే వ్యక్తులలోగూడా పరివర్తనం కలిగింది. సబర్మతి ఆశ్రమంనుంచి గాంధీమాత శంఖము పూరించేసరికి ఆసేతుహిమాచలపర్యంతమూ నిద్రా నైర్మల్యం వీడి అంజలి ఘటించి, సమరసన్నాహమైంది. ఆఉద్రేక వాయువులు నన్నుగూడా అవరించినై. ఒక్కమారుగా ఉద్యోగానికి స్వస్తి చెప్పి, రంగభూమిలోకి దుమికాను ....

౪

ఆసంవత్సరంలోపుగా హిందూదేశానికి స్వరాజ్యమిప్పిస్తా నన్నాడు గాంధీ. ప్రచారం తీవ్రంగా జరుగుతోంది. అధికారులలో దార్జన్యం ఎక్కువైనకొద్దీ ప్రజల్లో ఆవేశం ఎక్కువౌతోంది. ఊరూరు తిరిగి మా బోటివాళ్లం ప్రబోధం చేయడం ప్రారంభించాం. ఇటువంటి సంచారంలోనే ఒక్కమారు విజయరెడ్డిని కలుసుకున్నాను. కొద్దికాలంక్రిందటే తాను ద్వారకను చూచివచ్చాననీ, అతనిలో తీవ్రమైన మార్పున్నదనీ, ఆరోగ్యంగూడా హీనస్థితిలోకి వస్తోందనీ, అట్లాగే యింకా ట్యూషన్లు చెప్తున్నాడనీ, ఆవృత్తి విసర్జించమంటే వినలేదనీ చెప్పాడు రెడ్డి.

ఇది విన్న కొద్దిరోజులకే నాకు ద్వారక ఒకలేఖ వ్రాశాడు. ఆతురతతో విప్పి చదివాను: "ఈమధ్య నీపేరు వార్తాపత్రికల్లో తరుచు చూస్తున్నాను. నాన్-కో-ఆపరేషన్‌లో పనిచేసే ప్రచారకుల్లో నీవు చాలా సమర్థుడవని నాదృఢవిశ్వాసం. హిందూదేశంయొక్క బానిసశృంఖలాలు తెంపవలెనంటే నీవంటి తరుణోత్సాహులంతా నడుములు బిగించాలి. ఉత్సాహం లేనిదే ఏపనీ సాగదు...... మొన్న నీవు పన్నుల నిరాకరణం విషయంలో చూపెట్టిన ధైర్యం, సాహసం శ్లాఘనీయములు. ఒకమాసం కఠినశిక్ష ననుభవించడం గౌరవనీయము. అటువంటి అదృష్టం మొందరికో కలుగదు. దేశమాతకు నీ వింకా ఎక్కువగా సేవ జేసేటందుకు ఈశ్వరుడు ఆయురారోగ్యములను యిచ్చునట్లుగా ప్రార్థిస్తున్నాను.... మఱచిపోయినా; ఈ మాటు వేసంగిమైనా నీవు, చిన్నీ నాతో గడపవలసింది. మహా

భాగ్యం అనుకుంటాను. మీయిద్దరికి నా ఆశీస్సులు......ఉంటాను......ద్వారక......"

నిజంగా, యీ లేఖను భగవత్ప్రసాదితమైన అమృత కలశంగా భావించానంటే, నమ్మండి......నెలకు నూఱురూపాయలు వచ్చే ఉద్యోగం పోవడమే కాకుండా, ప్రయాణాలవల్ల, ప్రచారాలవల్ల మిక్కుటంగా డబ్బు వ్యయంకావడం, నెలరోజులు జైలులో అష్టకష్టాలు అనుభవించడం, వీటి అన్నింటి మూలాన యింట్లో జగడం, యింతలో వొంట్లో ఆరోగ్యం చెడడం—దానా, దీనా తీవ్రమైన మనోవేదనతో బాధ పడుతున్నా. అట్లాంటి సమయంలో, ద్వారక వ్రాసిన ఉత్తరం ప్రావృట్కాల పయోధరస్వామి శీతలస్పర్శ వలె కొంత చిత్తశాంతి చేకూర్చింది. ఆరాత్రి ఉత్తరాన్ని ఎన్నోమార్లు చదివి, దినమంతా రోదన చేసి చేసి సాయంకాలాన తల్లి చేత బుజ్జగింపబడి జోకొట్టబడ్డ పిల్లవాడిరీతి, స్వస్థతగా నిద్రించాను......

౫

అపూర్వగౌరవం చూపించాడు ద్వారక. స్టేషనుకు వచ్చి స్వాగత మిచ్చి తన యింటికి తీసుకువెళ్లాడు నన్నూ, చిన్నీని. అతను, అతని నివాసస్థానమూ యిదివరకురీతినే ఉన్నా, అప్పటికీ యిప్పటికీ కొంత వ్యత్యాసం కన్పడ్డది. మునుపటి ఉత్సాహం, ఉత్తేజం తగ్గింది అతనిలో. ముఖం తీక్ష్ణత తగ్గి కొంచెంగా మందగించింది. కాని మమ్మల్ని చూచేసరికి ఎక్కడలేని సంతోషం తెచ్చిపెట్టుకుని. తనలోని మార్పును మాటుజేయడానికి ప్రయత్నించాడు. నాలుగురోజులుమాత్రమే అతని ఆతిథ్యం అనుభవింపడానికి అవకాశమైంది. అప్పటికీ, యీ నాలుగుదినాలూ ద్వారక మమ్మల్ని అమితంగా ఆనందింపజేశాడు. తన గృహంలో స్త్రీలేని లోపం కనపడకుండా సదుపాయాలన్నీ చేకూర్చాడు. హోటలునుంచి వొచ్చిన భోజనాన్ని తానే వడ్డించడానికి సిద్ధపడేవాడు. కాని ఏ పూటకు ఆపూటే బలవంతంమీద ఆపని చిన్నీకి వదిలేసేవాడు. "ఇక్కడికి వచ్చినందుకు బాగానే వుంది" అనేవాడు నవ్వుతూ. "ఈ మాత్రానికేనా" అని నాకంటె ముందే అనేది చిన్నీ......రోజూ సాయంకాలం బీచికి వెళ్లేవాళ్లం, ముగ్గురం. సందర్భానుసారంగా అన్ని విషయాలను ముచ్చటించేవారం. అన్నింటిలోనూ ద్వారక పాల్గొని ఏదో కులాసాముక్క అంటూండేవాడు. అతను క్రుంగి పోతున్నా అతనిలోని ఉత్సాహఝురి యింకిపోలేదని కన్పడింది......ఒకనాడీవిధంగానే వాహ్యాళినుంచి తిరిగివచ్చి భోజనం కానిచ్చి మిద్దెపైన దక్షిణదిక్కున వరాండాలో కూర్చున్నాం మిత్రత్రయమూ. అంటే జ్ఞాపకం వచ్చింది. ఈకొద్ది కాలంలోనే చిన్నీ తననైజరీత్యా ద్వారకతో చనువుగానే ఉండేది......అట్లా కూర్చున్నాం. దక్షిణదిశ కాబట్టి గాలి దివ్యంగా వీస్తోంది. సముద్రపురొదయే కాకుండా, దూరాన సముద్రం వెన్నెట్లో మెరుస్తోంది. పట్నం కొంచెం జనసమ్మర్దం తగ్గి నిశ్శబ్దమైంది. తన యీస్థటిక్

సెన్సులంతా ఒక్కమారుగా చూపెట్టడానికి కాబోలు చిన్నీ అన్నది: "ఆ చెట్లమాటునుండి చందమామ యెలా దాక్కుడుమూచ్ ఆడుతున్నాడో!" దానితో మేమిద్దరంగూడా రస జగత్తులోకి దిగవలసొచ్చింది. ఇంతలో చిన్నీ మాట అందుకుని ద్వారక "యిదివరకు యిటు వంటివి యెన్ని మనం......"అని నావైపు తిరిగి అని, పూర్తిచేయలేక పోయినాడు. దానితో నాకు తరుణావస్థంతా కంటికి స్ఫురించింది. ఇట్లా మేము కొద్దిగా భావసమాధిలో ఉండగా అంతా మునిచుకుపోయినట్టు, "చూడండి, చూడండి, ఆ తారక లెట్లా చంద్రుడిచుట్టూ లాస్యం చేస్తున్నాయో......అవిగో, పెద్దమేఘా లెట్లా తరంగమాలికల్లే ఊగులాడుతున్నాయో"— అని, ఆగకుండా నావైపు తిరిగి, "వీటి నకల్లేనా యేమిటి మీ ఫేనమాలికలు"అన్నది నవ్వుతూ. నే నేదో మాట్లాడడానికి ఉపక్రమిస్తూండగా ద్వారక అడ్డువచ్చి, "ఇటువంటి సందర్భంలోనే కాబోలు బిల్హణుడు

'నేసం నభోమండలమమ్బురాశి
ర్నైమాశ్చ తారా నవఫేనఖండాః,
నాయం శశీ కుండలితః ఫణీన్ద్రో
నాయంకళంకః శయితో మురారిః'

అని అమోఘంగా అన్నాడు" అని మాధుర్యంగా చదివాడు. అప్పు డతని గాత్రకోమలత్వాన్ని గమనించి వెంటనే చిన్నీ "అయితే మీకు సంగీతజ్ఞానంగూడా బాగా ఉన్నదన్న మాట!" అని ప్రశ్నించింది. "ఉన్నదని పెద్దగా చెప్పడానికి వీలులేదు గానీండి, ఈమధ్యనే ఏడాదినుంచీ ఫ్లూట్ నేర్చుకుంటున్నాను, స్వంతంగానే. అందుచేత కించిత్ జ్ఞానం" అన్నాడు ద్వారక లౌక్యంగా.

"అయ్యో, యింతకాలం చెప్పారే కారు. అయితే శ్రమ అనుకోకుండా ఒక్కమారు వీనులకు విందు......"అన్నది చిన్నీ సరసంగా.

"ఆఁ. మతిచెడగొట్టేమాట లంటున్నారు. మీ రనుకొన్నంత ఏమీ ఉండదు."

"ఏదో నిమేషకాలం కాలక్షేపం—"

"అయినా మీకు వొచ్చినదాంట్లో నాపాలెంత?"

"సరేలెండి! పోరగా, పోరగా, మొన్ననే వీణె కొనిపెట్టారు. ఇంకా నేను శైశవంలో ఉన్నా ఆవిషయంలో."

"తక్కినవిషయాల్లోనో?" అన్నా నేను.

"ఊఁహు. అందుకున్నారూ —" అని చిన్నీ అంటూండగా ద్వారక తనగదిలోకి వెళ్లి ఫ్లూట్ తీసుకువచ్చి, "మీకు శ్రమ యివ్వడమౌతుంది"అన్నాడు.

"లేదు, లేదు" అన్నాం యిద్దరమూ ఒక్కమారుగా. మరొకమారు అడిగించుకోకుండా ఉత్తరక్షణంలో పాట ప్రారంభించాడు. "నాటిమాట మఱచితివో, ఓరామ, నాటిమాట......"అనేత్యాగరాజకీర్తన దేవక్రియా రాగంలో రసవంతంగా గానంచేశాడు. ఆగాన

ఘ్లటులతో మేమిద్దరే గాకుండా సాగరేశ్వరి గూడా లీనమైనట్లు కన్పించింది.

"ఓహో, యింత తెలిసేనా, మొదలు మొహమాటం పడ్డారు" అన్నది చిన్నీ.

"అబ్బే. అటువంటి దెప్పుడూ లేదు. ఇంకా ప్రారంభదశలోనే వున్నాను కాబట్టి కొంచెం అనుమానించాను. ఇంతకూ, సంగీత శాస్త్ర జ్ఞానము సారూప్యసౌఖ్యదమే, మనసా, అని త్యాగయ్య మహామహుడు అన్నాడుగదాయని మొదలుపెట్టాను యిది" అన్నాడు ద్వారక.

ఇంతలో నే నందుకుని, "ఎంతత్వరలో నేర్చుకున్నావు, ద్వారకా. నిజంగా మనస్సు బృందావనం......" అంటూండగా అత నడ్డంవచ్చి, "వీటికేంగాని, ఇది నాకు ఈరోజుల్లో బాగా ఉపయోగపడుతోంది. జీవితకష్టములన్నీ పాటలో మాయమవుతై" అన్నాడు.

"ఇంతకూ, అదృష్టవంతుడవోయ్"—అని నే నన్నది వినేసరికి అతనిముఖం వికృతాకారం పొందగా, "నేనా?" అని ఊరుకున్నాడు. ఆమాట నాలో దూరి హృదయనాళాలను జలదరింపజేసింది.

ఇంతలో నిద్దర వస్తోందని క్షమాపణ చెప్పి చిన్నీ నిష్క్రమించింది.

"ద్వారకా, క్షంతవ్యుణ్ణి—" అన్నా అతన్ని చూస్తూ.

"దేనికి, దేనికి—" అన్నాడు ఆదుర్దాగా.

"ఇంతవరకూ నీకష్టాల్ని గూర్చి నిన్ను..."

"చాల్లేవోయ్. నేర్చుకున్నావు... ఏమన్నా వుంటే నేనే చెప్పేవాణ్ణిగా...... ప్రొద్దు పోతోంది, పడుకుందాం పద."

"ఈమధ్య, రెండుమూడుమార్లు రెడ్డి..."

"అవును నీ మాస్తరు వైరివాడే రెడ్డి గూడాను...... అన్నీ సావకాశంగా యీ మారు నీవు వచ్చినప్పుడు మాట్లాడుతానుగాని, యిప్పుడు పోయి నిద్రించు. తిరిగి తెల్లవారే ప్రయాణం చేయవలసినవాడవు" అన్నాడు. నేను మరొక ప్రశ్న వేసేందుకు వీల్లేకుండా, ఏమీ లాభం లేకపోయింది. మనస్సులో మాత్రం పొరబాటు జరిగిందని తీవ్రంగా బాధపడ్డాను.........

ఊరికి బయల్దేరాం. నాకూ, చిన్నీకి బట్టలతో గూడా అంపకాలు చేశాడు. స్టేషను దాకా వచ్చి, "దసరాకు రావాలి సుమా!" అంటూ సాగనంపాడు.

త్రోవలో అన్నది చిన్నీ — ఏమండీ. ఎప్పుడూ చెప్పారేకారు. ఆయున దగ్గర ఎంత పాండిత్యం, ఎంతప్రతిభ ఉంది. ఎంత ఉదాత్తుడు. నిజంగా, అటువంటి ఒక్కమిత్రు డున్నా చాలు—అంటూ కొంతసేపు ద్వారక భావోత్కర్షాన్ని, సౌహార్దాన్ని కీర్తించింది......

౬

మేము యింటికి జేరుకున్న నెలకు విజయ రెడ్డి ఉత్తరం పంపాడు. "ద్వారక చాల్త జబ్బు స్థితిలో ఉన్నట్లు అతనిమిత్రు డొకడు నాకు కబురుజేశాడు. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో

ఉన్నాట్ట. జీవించడం కష్టసాధ్య మనుకుంటు న్నారట. వెంటనే రావలసింది ......"

మరుదినం ఉదయానికి పట్నంలో ఊడి పడ్డాను. ఆస్పత్రిలోకి జనాన్ని పోనిచ్చేవేళ యింకా కాలేదు. అయినప్పటికీ అక్కడున్న నర్సు నాఆవేదన కనిపెట్టి రహస్యంగా తీసుకు పోయింది లోపలికి. రోగి హీనస్థితిలో ఉన్నా డనీ, ఎక్కువగా మాట్లాడకుండా త్వరితం రమ్మని చెప్పింది.

తెర అడ్డంకట్టివున్న మంచంమీద ద్వార క శయనించాడు. మేలుకునే ఉన్నాడు. నన్ను చూడగానే "వచ్చావా......" అని స్వాగత మియ్య ప్రయత్నించాడు. లేస్తాడేమో అనే భయంతో చెంగున దగ్గర జేరి ప్రక్కగా కూ ర్చుని,—'విశ్రమించు'—అన్నా.

"ఆఁ. ఇదిగో. కొంచెంసేపట్లో శాశ్వతం గా విశ్రమిస్తాను."

"ఎప్పుడూ యింతే, ద్వారకా, నువ్వు పడుకో......"

"అయితే చిన్నీ కులాసాగా......"

"ఇప్పు డవన్నీ యెందుకు...... ఇంతలో యిట్లా సంభవిస్తుందని అనుకోలేదు. ఏం పని జేశావు, ద్వారకా" అని కళ్లల్లోకి నీరు తెచ్చు కున్నా, ఆశల్యపంజరాన్ని చూచి...... "అదేం పనోయ్, జీవనసంధ్య ముగియబోతోంది. పున ర్జన్మలో మిమ్మల్ని కలుసుకొంటాలే ...... అయితే మొన్న జరిగినఆర్టు ఎక్జిబిషన్‌లో..."

ఇంతలో నర్సువచ్చి నాకు వచ్చేయమని సైగ జేసింది. ద్వారకను తుదిమారు దర్శించి వెనక్కు తిరిగాను. అత నప్పుడే నేత్రాలు ముకుళించాడు. ద్వారకను ఆహ్వానింపమని దేవ కన్యకలనుగూర్చి ప్రార్థించాను.

౨

ద్వారక ఆస్తివిషయం నేనూ, విజయ రెడ్డీ ఏమి చేయడానికీ ఏమీ మిగిలింది కాదు. అతని నిలయంలో తండ్రి ఋణములను తీర్చి వేసిన తాలూకు కాగితాలు, మజుందార్ చిత్ర సంపుటి, త్యాగరాజుకీర్తనల పుస్తకం, జయ దేవుడి గీతగోవిందం,—దొరకినాయి. ఇవి గాక పెట్టిఅడుగున గుప్తంగా ఉన్న కాగితాలు తీస్తే, శాఫో ప్రేమగీతాల అనువాదములూ, అతను రచించిన "జూకామల్లెలు" అనే పద్యాలవ్రాత ప్రతి—బయటపడ్డాయి. మొదటిది విజయరెడ్డికి కృతియిచ్చాడు. రెండోది చిన్నికి, నాకు అంకిత మిచ్చాడు......అవును. అది అతని నైజం. తాను కృశిస్తున్నా, యితరుల సంతోషానికి సహాయభూతుడుగా ఉండడానికి ప్రయత్నించే వాడు. తనయొక్క జీవితాన్ని తనఆదర్శముల ప్రకారం సాగించుకోలేక విదళిత హృదయు డైనా, పైకి ఏమాత్రం కన్పడనీకుండా, అం త్యమువరకూ ఆనందంగానే ఉన్నాడు! మహా చిత్రమైన మానవుడు, ద్వారక.